# అభిషేకద్రవ్యాలు-ఫలితాలు

-- యేలూరిపాటి ఆంజనేయశర్మ

శివరాత్రి వస్తోంది. "అభిషేకప్రియః శివః". శివుడు అభిషేకప్రియుడు. అభిషేకమంటే స్నానం చేయించటం. అభిషేకానికి నీటినిమాత్రమే కాక అనేక ద్రవ్యాల నుపయోగించటం మనం చూస్తూంటాం. ఉదా: పాలు మొదలగు పంచామృతాలు. శివచరిత్ర, శివుని మహాత్యము, ప్రభావం, శక్తిసామర్థ్యాలు అనేకమున్నాయి. శైవమంత్రాలు, వాటి అనుదణున, పౌనః పున్య, శాబ్దికశక్తులు అనేకమున్నాయి. శివలింగస్వరూప స్వభావాలు, సహజీలు-తయారీవిధానాలు వాటికి వాడే పదార్థాలు (ఉదా: రాయి, స్పటిక, మట్టి, పసుపు, గోమయం, బంగారం, వెండి, పాదరసం, రకరకాల మణులు మొ:) అనేకం ఉన్నాయి.

ఆయా ప్రత్యేక ప్రయోజనాల సాధనకు, ఆయావస్తువులతో చేసిన లింగాలపై నిర్దేశిత వస్తువులతో అభిషేకించి నిర్దిష్ట ప్రయోజనాన్ని పొందటం కద్దు. ఈ సందర్భంలో వివిధ మంత్రాల ఉచ్చారణ-సంపుటీకృతపఠనం మొ: కూడా అవసరం. భావశుద్ధికి, ఏకాగ్రతకు శివసంబంధ శక్తిసామర్థ్యాల జ్నప్తి అవసరం. సమస్య తీవ్రతనుబట్టి లింగనిర్మాణం, మంత్రసంపుటీకరణ పద్ధతి, వస్తువినియోగం, అభిషేకవిధానం మారుతూ ఉంటుంది. నియమ నిష్టలు మారుతూంటాయి. అవన్నీ సాధకుని లేదా పురోహితుని పై ఆధారపడి నిర్ణయ మవుతూంటాయి. వాటన్నిటి వివరాలు ప్రస్తుత ఉద్దేశ్యం కాదు.

ప్రస్తుతం రుద్రకామ్యార్చనా విధిలో చెప్పబడ్డ అభిషేక ద్రవ్యాలు, ఏ ద్రవ్యంతో చేస్తే ఏం ప్రయోజనం సిద్ధింస్తుందో స్థాలీ పులాకంగా చూపటమే ఉద్దేశ్యం.

పాలతో అభిషేకం చేస్తే సకల సౌఖ్యాలు, పెరుగుతో ఆరోగ్యం, బలం, కీర్తి, నేయితో ఐశ్వర్యవృద్ధి, పంచదారతో దుఃఖ నాశము, తేనెతో తేజోవృద్ధి-చక్కని కంఠస్వరం-మాట, చెరుకురసంతో ధనం, కొబ్బరినీటితో సర్వసంపత్సమృద్ధి, భస్మోదకంతో మహాపాతకనాశనం సంభవిస్తాయి.

గంధోదకంతో సత్పుత్ర లాభం, పుష్పోదకంతో భూలాభం, బిల్వోదకంతో భాగ్యం, గరికనీటితో పోగొట్టుకున్న డబ్బు తిరిగి లభిస్తుంది.

నువ్వులనూనెతో అపమృత్యువు హరిస్తుంది. రుద్రా క్షోదకంతో గొప్ప ఐశ్వర్యం, బంగారం మీదుగా నీటితో అభిషేకిస్తే ఘోరదారిద్ర్యం నశిస్తుంది.

అన్నాభిషేకంతో రాజ్యప్రాప్తి, మోక్షం, ఆయుస్సు, మంచి జీవనం లభిస్తాయి. ద్రాక్షరసంతో ఎల్లెడలా విజయం, ఖర్జూరఫలరసంతో శత్రుహాని, నేరేడు ఫలరసంతో వైరాగ్యం, కస్తూరితో చక్రవర్తిత్వం లభిస్తాయి.

నవరత్నోదకంతో ధాన్య-గృహ-గోవృద్ధి కలుగుతుంది. మామిడిరసంతో దీర్ఘవ్యాధులు నశిస్తాయి. పసుపునీటితో శుభాలు జరుగుతాయి.

ఇవన్నీ రుద్రస్నాన ఫలితాలుగా మునులు చెప్పారు. వాటిని ప్రస్తుత దేశకాల పరిస్థితులకు అన్వయించుకోవాలి. ఉదా: ఉద్యోగాన్వేషణలో ఉన్నవారు అన్నాభిషేకం చేయాలి. పిల్లలు కావల్సినవారు గంధోదకంతో అభిషేకించాలి. ఆరోగ్యం ప్రమాదస్థాయిలో ఉన్నప్పుడు, నువ్వులనూనెతో అభిషేకం చెయ్యాలి--అలా..... ఎంత అన్నం, ఎంత గంధపునీరు లాంటి సందేహాలు రావచ్చు. ఆకాంక్ష తీవ్రతనుబట్టి 5 (పంచాక్షరీ సంఖ్య) 11 (రుద్ర సంఖ్య) 27 (నక్షత్ర సంఖ్య) 108 (నక్షత్ర పాద సంఖ్య) అలా....సంఖ్యను నిర్ణయించుకుని కేజీలా, లీటర్లా లాటివి లభ్యతనుబట్టి నిర్ణయించుకొని, మంత్ర సంపుటీవిధానాన్ని-సంఖ్యనుకూడా నిర్ణయించుకొని చేస్తే ఫలితాలుంటాయి. అవసరాన్నిబట్టి అనుభవజ్నుల సలహా సంప్రదింపులతో నిర్ణయించుకొంటే ప్రయోజనకరం.

ఆయాపదార్థాల శక్తిసామర్థ్యాలను పరిశోధించి తెలిసికోవచ్చు. ఉదా: నీటికణాలశక్తి శాస్త్రీయంగా నిరూపితమైంది. 'మసారు యొమెటొ' అనే జపాను శాస్త్రవేత్త నీటి క్రిష్టల్స్ మీద పరిశోధించి, వాటికి మన ఆలోచనలకు, మాటలకు అనుకూలంగాను-ప్రతికూలంగాను కూడ స్పందించే శక్తి వుందని తేల్చారు. మామూలు నీటికే ఇలా వుంటే 'గంగాజలం' లాటి వాటి గురించి చెప్పాలా? మంత్రపూతమైన తీర్థజలం, అభిషేకజలాలను గురించి వివరించాలా?

అభిషేకద్రవ్యాల పదార్థశక్తిని గూర్చి పరిశోధనలు అవసరమే. మంత్ర-స్వర-ఉచ్చారణల ప్రభావాలు వాటికి పదార్థాలు ప్రతి స్పందించే విధానాలపై పరిశోధనలూ అవసరమే. ప్రత్యేక ప్రయోజనాలు ఎలా సిద్ధిస్తాయన్నది తెల్చుకోవల్సినవిషయమే.

సిద్ధిస్తున్నాయన్నది మాత్రం అనుభవంలోని విషయమే. ఫార్ములా తెలియకపోయినా, ప్రయోజనాన్ని పొందటం సామాన్యుని పరిమితి. సామాన్యునిగానో, అసామాన్యునిగానో సాధకులై సాధించి చూడండి.